# వ్రత ప్రభావమా?

కర్లపాలెము కృష్ణరావుగారు

౧

సుశీల:—పిల్లా! మీఅత్తగారు శ్రావణ పట్టీబంపేరు చూచేవా?

ప్రభావతి:—శ్రావణపట్టీ అంటే యేమిటే? అమ్మా!

సుశీల:—అంటేయేమిటా? దీనిచరిత్రచాలావుంది. పూర్వం శ్రావణపట్టీలులేవు. ఇప్పటి నవనాగరికులు సృష్టిచేసినవీటిని. పరిణయమైనపిమ్మట పిల్లను అత్తవారింటికి తీసుకొనిపోవడానికి అవకాశముగల్పించి అత్తవారింటి ఆచారవ్యవహారాలు, వేషభాషలు, మర్యాదమన్ననలు, అనుభవంలో పెట్టడానికి పుణ్యప్రదమైన శ్రావణమాసముమంచిదని యూహించి, పెండ్లియైనపిమ్మట వచ్చే ప్రథమశ్రావణమాసంలో పెండ్లికూతురిని అత్తవారింటికి తీసుకపోవడం ఆచారంగాజరిగింది కొన్నాళ్లు. తరువాత రాను, రాను నాగరికతవిస్తరించి విచక్షణజ్ఞానశూన్యులైన కొందరికి పూర్వాచారం మోటైపోవడంచేత, పిల్లను అత్తవారింటికి కొనిపోవడానికిమారుగా పెండ్లికొడుకుగారింటినుండి పెండ్లికూతురుగారింటికి నోమునోచుకోడానికి శ్రావణపట్టీపంపించడం ఆచారమైంది.

ప్రభావతి:—అదాకథ? ఆపట్టీలో యేమేముంటాయి?

సుశీల:—పోయిచూడరాదూ? లేచిరా! తలంటి నీళ్లుపోస్తాను, నోచుకోందుగాని.

ప్రభావతి కాంతులొలికే అధరబింబంమీద చిరునవ్వు ప్రకటిస్తూ లేచి పందువాలోకేగి, అచ్చటనున్న శ్రావణపట్టీకి సంబంధించిన సాంబారాలన్నిజూచి మరియొక తబుకులోనున్న సన్నకాగితపుపొట్లాన్నిదీసి, ఆత్రంతో అందులోయేముందోనని పొట్లమువిప్పిచూచింది. విలువగల చిలుకపట్టుచీర. తనకోమలహస్తాలతో, వికసించినముఖారవిందముపై చెరలాటలాడుచున్న నల్లత్రాచుపిల్లలవంటి ముంగురులను సర్దుకొని చీరమడతదీసి పొరలసందున పెట్టబడిన కాగితపుముక్కనుదీసి చదువుకొన్నది.

“ప్రియమైన ప్రభావతికి—

ప్రేమలాంఛనముగా సమర్పించినది.

ఇట్లు, ప్రేమపాత్రుడు

విమలానందమూర్తి.”

ఆశ్చర్యశోకపంక్తి పిగ్గోకపంక్తివచ్చి అరికట్టినయి ప్రభావతి ఆనందాన్ని. “ఇదేమిటి నాపేరువ్రాశారు?” అనుకొన్న దాపిల్ల తనలో. ఇదోవిధంగా బాగానేవుందనుకొన్నదిమళ్లీ. ఇంతలో సుశీలవచ్చి “నీ మొగుడే పంపేడులే అబ్బరంగా! అస్తమానంచీరజూచుకొంటూ కూర్చుంటావా? కావలసినంతపనివుంది, లేచిరా?” అన్నది.

ప్రభావతికి పదమూడోసంవత్సరంజరుగుచున్నప్పటికి చురుకైనపిల్ల గావడంవల్ల నాలుగోఫారం వరకుచదివింది. పెద్దపిల్లగదా అని అనుమానిస్తూ, తల్లిదండ్రులు చదువుమానిపించేరు. లోకవ్యవహారాలు తెలుసుకోవడానికి యిప్పుడిప్పుడే కళ్లుతెరుస్తున్నది ప్రభావతి. తండ్రి “గృహలక్ష్మి” మున్నగు మాసపత్రికలు, నవలలు, నాటకాలు తెప్పించియిస్తూంటే విసుగులేకుండా చదువుతుండేది. ఒక్కతే పిల్లగావటంవల్ల తల్లిదండ్రులు గారాబంగా పెంచుతుంటే సుకుమారంగా పెరుగుతున్నది. మూడుపాళ్లు పసుపు రెండుపాళ్లు

నిండుగులాబి కలిపితే వచ్చే అందమైనరంగుతో చంద్రబింబమువంటి ముఖముగల్గి పట్టుకుచ్చులవలె నిగనిగలాడుతు పిరుదులవరకు వ్రేలాడే కురులుగల్గి, సర్వాంగసుందరియై, సౌందర్యానికి వన్నెలుచెక్కే విద్య, విద్యకు మెఱుగులుపెట్టే వినయముగల్గి విరాజిల్లుతూంది ప్రభావతి.

౨

స్త్రీల కఖండపుణ్యప్రదమైన శ్రావణమాసము ప్రభావతియింట్లోనే అవతరించిందా అన్నట్లు, వస్తూపోతూవుండే ముత్తయిదువ్వులకు వినుగువిరామము లేకుండా కలకలలాడుతు పెండ్లివారియిల్లుమాదిరిగా మంగళ వాద్యములతో, భామినీజనము వేడుకపాటలతో గడచిపోయింది. "మృగయువకు పెద్దపులియెంతో మేకము నంతే" యన్నట్లు శోభాయమానమగు శ్రావణమాసాన్నిగూడ కాలప్రవాహంకొట్టుకొనిపోయింది. క్రమక్రమంగా వారాలు పక్షాలు గతించి మాసాలు నడుస్తున్నాయి. కార్తీకమాసం ప్రవేశించింది. శుభకార్యం కాస్తాముగించి పిల్లను మాయింటికి పంపిస్తే బాగుంటుంది అని అత్తవారు వార్తబంపేరు. ఆవార్తవిని ప్రభావతి ముసిముసినవ్వులునవ్వడంజూచి తల్లిదండ్రులుగూడ "సరే" నన్నారు. ఒకశుభముహూర్తాన నలుగురుచుట్టాలు చేరి ఆకాస్తమొక్కు చెల్లించి పిల్లను అత్తవారింటికి బంపించేరు. జరుగవలసిన మర్యాదలన్ని, యింటి ఆచారాన్ని అనుసరించి యథావిధిగా జరిపేరు. ప్రభావతి అత్తగారింట కాపురంజేస్తున్నది. తనకను వన్నెలమెలగుచూ, వినయవిధేయతలతో ప్రవర్తించుచుండుటచేత అత్తగారు ప్రభావతిని దయగాజూస్తున్నది. విమలానందమూర్తి భార్యను లాలించి, ప్రేమించి, ఆదరిస్తూ ఆనందవార్ధినోలలాడిస్తున్నాడు. బాలదంపతుల ప్రథమానురాగసుఖసంపదలను, భావాలను రెవరు వర్ణించగలరు? సుగుణవతియు సౌందర్యవతియునగు ప్రభావతి తనకు భార్యగావడం తనపూర్వజన్మసుకృతమే ననుకొన్నాడు. "నీకన్న అమూల్యమగువస్తువీప్రపంచమునలేదనియు, నాసర్వస్వము నీవేననియు, నీవులేకున్న లోకమే శూన్యమనియు" అన్నాడు భార్యతో. ప్రణయపాశబద్ధులయిన ప్రభావతీవిమలానందులు అనిర్వచనీయానందమనుభవిస్తూ ఆరుమాసాలుగడిపేరు.

మగడు ఖద్దరంటే అభిమానం జూపిస్తూ శుద్ధస్వదేశీవస్త్రాలనే ధరించుచుండడంచేత తానుగూడా ముతకబట్టలను గట్టుటకలవాటుపడుటయేగాక, ప్రభావతి స్వయంగా రాటముమీద నూలువడుకుటకు ప్రారంభించింది. యుక్తాయుక్తము లెరిగిన చదువుకొన్న పిల్లగావడంచేత, ప్రభావతికి పూర్తిగాదేశాభిమానంయేర్పడ్డది. దేశసేవచేయుటయందు పురుషులకెంత బాధ్యతకలదో స్త్రీలకుగూడా అంతబాధ్యత అంతజవాబుదారీ కలదని గ్రహించింది. ఇట్లా కొన్నాళ్లు జరుగుచుండగా ఒకనాడు ప్రభావతితండ్రివచ్చి పిల్లను పుట్టింటికి పంపవలసినదని వియ్యాంకుని అడిగి త్వరలోనే మళ్లీపంపిస్తానని అల్లుణ్ణి బతిమాలుకొన్నాడు. మొదట కాదన్నా తర్వాత దీర్ఘంగా ఆలోచించి 'సరే' నన్నాడు విమలానందునితండ్రి. భర్తను విడచియుండుటకు యిష్టంలేకపోయినా బాల్యస్నేహితురాండ్రను, తల్లిని చూడవచ్చుననుయాశతో "పంపించండి" అని భర్తను ప్రార్థించింది ప్రభావతి. తుట్టతుద కందరు యిష్టపడ్డారు. మంచిరోజుజూచి ప్రభావతిని ప్రయాణం చేశారు. "మీరుత్వరలో మావూరురండి, నాలుగు రోజులుండిరావచ్చు" అని భర్తను వేడుకొని తండ్రివెంట స్వగ్రామమువెళ్లింది ప్రభావతి. విమలానందునికి మొదటినాలుగురోజులు కాస్త పిచ్చిపిచ్చిగావున్నా తర్వాత తర్వాత పనిపాటులు చేసుకొంటూ మామూలుగానే తిరుగుతున్నాడు. అప్పట్లో జరుగుచున్న సత్యాగ్రహోద్యమమునందు తానుగూడ శ్రద్ధతో పనిజేస్తూ గ్రామంలో జరుగుతున్న సభలకుహాజరవుతుండేవాడు.

౩

ఉత్తమగ్రంథాలు చదవడమూ, రాటముత్రిప్పడమూ, ఈడువారలతో సరససల్లాపాలు ఆడుకోవడమూ మున్నగు పనులతో హాయిగా కాలక్షేపంజేస్తున్నది ప్రభావతిపుట్టింట. నిత్యము రాటానికి పూజజేస్తూ వీలగునప్పుడెల్లా జాతీయగీతాల బాడుతూ దారముదీస్తుండేది. లక్ష్మీదేవివలె రాటముముందు గూర్చొని మనోహరంగా గీతాలుబాడుతూవున్నప్పుడు కళ్లపండువుగా జూచియానందిస్తుండేవాళ్లు తల్లిదండ్రులు. ఒకనాడు

మామూలుప్రకారం ప్రభావతి మహోల్లాసముతో మునిగివుండగా తండ్రి దీనవదనంతోవచ్చి యేదియో చెప్పబోయి చెప్పలేక ఒకజాబును ప్రభావతికిచ్చేడు. తనమామగారియొద్దనుండి వచ్చినదనిగ్రహించి ఆమెయుత్సాహంతో జాబుజదువుకొన్నది. ఎంతయుత్సాహంతో చదవడానికి ప్రారంభించిందో అంతనిరుత్సాహంతో పూర్తిచేసింది. "సహాయనిరాకరణవాదియగుటచే విమలానందుని యధికారవర్గమువారు రెండుసంవత్సరాలు కఠినశిక్షవిధించి రాజమండ్రి జైలులోవుంచేరు" అని ఆజాబులోవున్నది. మఱుక్షణము యింటి ముంజూరునుండిరాలు వర్షబిందువులమాడ్కి ప్రభావతికి కన్నీరు జలజలగారింది. తననుజూచి తండ్రిగూడా చింతిస్తాడేమోనని తనలోతాను పొరలి పొరలి వచ్చు దుఃఖాన్ని మ్రింగుకొని "నాన్నా! నేడెంతసుదినం?" అన్నది. గద్గదస్వరముతో తండ్రి "సుదినమా? అలాఅంటున్నావేమిటమ్మా?" అన్నాడు.

"కాదామరి? లోకకళ్యాణముకొఱకు నాభర్త నిర్బంధింపబడ్డాడు. ఇదిశుభవార్తగాదా?"

"నిజమేగాని...నాకు మనస్సునిలవడంలేదు. జైలులో అనేకకష్టాలున్నాయి. నీచాతినీచమైనపనులు."

"నాన్నా! ముక్కుపచ్చలారని ముద్దుబిడ్డలు, స్త్రీలు, వృద్ధులు సైతము దేశంకొఱకు కారాగృహాలకు వెళ్లుచుండ యుక్తవయస్కుడు, విద్యాధికుడునగు మీయల్లునికొఱకు కింతదిగులెందుకు? వారివిషయము నాకు సంతోషమే. కాని దేశసేవచేయుభాగ్యం నాకుకూడలభించలేదుగదాయని విచారిస్తున్నాను."

ఇట్లు అంటూప్రభావతి చివాలున లేచి పడకగదిలోకివెళ్లి శయనించింది. ఇప్పుడామెమనస్సులో పెద్ద తుపానొకటి పట్టుకొన్నది. ఏమిచేయవలెనో తోచడంలేదు. జైలులో యెన్నికష్టాలు పడుతున్నాడో భర్త అని దుఃఖించి తానే తెలివిదెచ్చుకొని నేనుగూడా దేశసేవజేయగూడదా అనుకొన్నది. ఛీ, అధమమగు ఆడుజాతిలో పుట్టేనేమా అని అనుకొన్నది. ఏమేమోతర్కవితర్కాలు జరుగుతున్నాయి. "స్త్రీజాతిని దూషిస్తున్నానేమిటి? లోకాన్ని ముంచడానికిగాని తేల్చడానికిగాని స్త్రీజాతికే సమర్థతవుంది. తనకత్తికి యెదురుకత్తిలేకుండా రాజ్యాలు యేలిన విక్టోరియారాణి ఆడుదికాదా? ఘోరరాక్షసుడైన నరకాసురిణ్ణి చంపడానికి తోడుపడ్డ సత్యాదేవి ఆడుదికాదా? హరిశ్చంద్రునికి అఖండయశము సార్జించిపెట్టిన చంద్రమతి ఆడుదికాదా? ముల్లోకాలను గడగడలాడించే యమధర్మరాజును సైతము ధిక్కరించి భర్తను సంపాదించుకొన్న సావిత్రి ఆడుదికాదా? ఇంతెందుకు? నేటి శాంతియుద్ధాన పాలుగొంటున్న వారిలో అధికసంఖ్యాకులు వనితలేగదా? నేనుమాత్రమెందుకు నడుముకట్టగూడదు? శక్తిసామర్థ్యాలు, తెలివితేటలుచాలకనా?...కాదు, కాదు...జైలులోవున్న నానాథుని విజయధ్వజముతో విడిపించే మార్గంచూస్తాను. నేను నిజంగా పతివ్రతనైతే, నాభర్తకు జయభేరి మ్రోగిస్తాను...ఇప్పుడు నేనేంచెయ్యాలి? నాభర్తనుదర్శించిరావడం నాప్రథమ కర్తవ్యము." అని యేమేమో ఆలోచిస్తూ ప్రభావతి "నాన్నా!" అనికేకవేసింది. తండ్రివచ్చేడు. "నాన్నా! రాజమండ్రిజైలుకువెళ్లి నీఅల్లుణ్ణి చూచిరావాలి, ఈరాత్రికే ప్రయాణం, సిద్ధగావుండు" అని అన్నది. తండ్రి తలయూపుతూ సంతోషంలో వెళ్లేడు. ప్రభావతి భర్తకొకహారము సమర్పించాలెననుకొన్నది. వెంటనే లేచి పూలతోటలోనికి వెళ్లి తనకంటికింపైనపూలను గోసుకొనివచ్చి ఓపికతోగూర్చొని శ్రద్ధతో సుందరమైనహారాన్ని తయారుజేసుకొన్నది. ఖద్దరువస్త్రముతడిపి వాడిపోకుండా హారానికిచుట్టి జాగ్రత్తగా దాచింది. భర్తకొఱకు ఫలహారాలు యింకా కావలసిన అద్దము, దువ్వెన, సబ్బు మున్నగు చిల్లరవస్తువులు సిద్ధంజేసుకొని ప్రయాణమై తండ్రితోగూడా 8 ఘంటలరైలులో రాజమండ్రివెళ్లింది.

౪

ప్రభావతి ప్రాతఃకాలాన నిద్దరలేచి తలారస్నానముజేసి యిష్టదేవతలనుగొల్చి రాటానికి పూజ చేస్తుంది. చెప్పిన నోములన్నినోస్తూ, పలికిన వ్రతాలన్ని శ్రద్ధతో పడుతువుంది. ఒంటిపూటభుజిస్తూ కటికనేల మీద శయనించడంవల్ల మనిషికాస్త నలిగినా సహజంగా సౌందర్యవతిగావడంచేత అందచందాలేమితగ్గలేదు. పూర్వంవలె తల్లిదండ్రులతో చనువుగా మాట్లాడడంగాని చెలికత్తెలతో యిష్టాగోష్టిచేయడంగాని లేదు.

రాత్రింబవళ్లు భగవదారాధనదప్ప యితరచింత లేకుండా మంచిరోజులకై నిరీక్షిస్తూవున్నది. నిశ్చయంగా భగవంతుడనే వాడొకడువుంటే ఆభగవంతుడికి భక్తులనుపాలించడమే ధర్మమైతే యింతదీక్షతో, యింతశ్రద్ధతో యింతభక్తితో పూజిస్తున్న ప్రభావతి మొర ఆలకించడా?

కాలచక్రం శరవేగాన్ని మించి పరుగెత్తుతూంది. క్రమక్రమంగామళ్లీ శ్రావణమాసమొచ్చింది. క్రిందటి శ్రావణమాసంలో అత్తవారుపంపిన శ్రావణపట్టీ విమలానందుడు పంపినచీర తలపునకువచ్చి దుఃఖించింది ప్రభావతి. ఈయేడుమాత్రం యెందుకు ఉల్లాసంగా శ్రావణమాసంగడపకూడదు అనుకొన్నది. కృష్ణాష్టమి వ్రతము, గరుడపంచమివ్రతము, వరలక్ష్మీవ్రతము శ్రద్ధతోను భక్తితోను వరుసగాజరుపుదామనుకొంది. స్త్రీలకు పుత్రపౌత్రాదిసర్వసంపదలనొసంగి కామితార్థముల చేకూర్చు ప్రభావముగలదిగదా వరలక్ష్మీవ్రతము అని యూహించుకొన్నది. శుభదినము సమీపించగానే, అనగా పూర్ణిమకు ముందు శుక్రవారమునాడు ఉదయాన లేచి స్నానంజేసి మడిబట్టలు గట్టుకొన్నది. శుభ్రమైనప్రదేశాన్ని గోమయంతో అలికి మంటపముజేసి ఆసనమునేర్పాటుజేసి దానిమీద క్రొత్తబియ్యంబోసి మర్రిచిగుళ్లు మొదలగు పంచపల్లవంబులకలశంబేర్పరచి వరలక్ష్మీదేవిని ఆవాహనజేసింది. పురోహితుడిసహాయంతో సక్రమంగా పూజలుజేసి తర్వాత పండ్రెండు కుడుములవాయినదానాలు, దక్షిణతాంబూలాదులొసంగి, బ్రాహ్మణోత్తములకు నమస్కారాలు జేసింది. బ్రాహ్మలంతా ఆశీర్వదించేరు. ప్రభావతి మహదానందంబొందింది. ఎప్పటికైన వరలక్ష్మీదేవియే తన్నుద్ధరించునని తనభర్తకు జయముగలిగించునని నమ్మికొన్నది. శ్రావణమాసమంతా వ్రతాలతోను బ్రాహ్మణసంతర్పణలతోను గడచిపోయింది.

దేవపూజలతో కొన్నాళ్లు, నోములతో కొన్నాళ్లు జరిగినయి. ఎన్నాళ్లు జరిగితే రెండేండ్లు పూర్తి అవుతాయి? రెండేండ్లకుగదా విమలానందునికి కారాగృహవిముక్తి గలిగేది? ఈవిధంగానే సంతోషంగామరికొన్ని నెలలు నెట్టింది ప్రభావతి. ఒకనాడు ప్రభావతి యెందుకో తనపెట్టెతీయగా అందులో తనభర్త ప్రేమ లాంఛనంగా సమర్పించిన చిలుకపట్టుచీర కంటబడ్డది. వెంటనే ఒకదాని వెనుక నొకటిగా సినిమాబొమ్మలవలె తానుతనభర్తతో అనుభవించినసుఖాలన్ని కట్టెదుట సాక్షాత్కరించినయి. ప్రభావతి కాచిలుకపట్టుచీర కట్టుకుందామని బుద్ధిపుట్టింది. చీరెయివతలికిదీసి పెట్టెబీగంవేసింది. లేచివచ్చి రేగినతలను సవరించుకొని పరిశుభ్రంగాస్నానంజేసి, శుభసూచకమైన తిలకాన్ని దిద్దుకొని చిలుకపట్టుచీరధరించి నిలువుటద్దంలో తన అందాన్ని జూచి ఆనందించింది. ఇప్పుడు తనభర్తవెంటవుంటే....అని యేమేమోఅనుకొన్నది. ఇంతిలో తండ్రి కేక వినబడ్డది. వస్తున్నానంటూ జనకుని యొద్దకువెళ్లింది.

ఊరంతాదీపాలువెట్టేరు. ప్రభావతి వీధివాయిన్తు కూర్చొన్నది. కొంతసేపైనతర్వాత "ఇవ్వాళ నాకీయలంకారాలన్నియెందుకు? ఎవరుజూచి సంతోషించను?" అనిఅనుకొన్నది. "ఎందుకోలే, నాపిచ్చి నాక్కానందం" అని తనలోతాను చెప్పుకొన్నది. తండ్రి భోజనానికి రమ్మనమనిపిలిచేడు. వీధివాకిలి తలుపు గడియవేసివెళ్లింది. తండ్రికంటె ముందుభుజించి లేచివచ్చి కుర్చీలో కూర్చొని ఆకాశపంచాంగం గుణిస్తువున్నది. తల్లిపక్షిమంటే తండ్రి యింకా భోంచేస్తున్నాడు. వీధిలో యెవరో తలుపు తట్టుతున్నారు. "ఎవరువారు?" అన్నదిప్రభావతి. జవాబులేదు. ప్రభావతి లేచితలుపునొద్దకేగి గడియదీసింది. ఎవరికోసం నోములు నోస్తున్నదో- ఎవరికోసం యీప్రయత్నంఅంతా చేస్తున్నదో- ఎవరికోసం ఉపవాసాలుజేసి కృశించిపోయిందో ఆవిమలానందమూర్తి ప్రత్యక్షమైనాడు. ఇంకేంకావాలె? ఇరువురు ఒకరినొకరు చూచుకొన్నారు. ఇద్దరికి నోటమాట రాలేదు. కొంతసేపటికి "ప్రభా!" అన్నాడుభర్త. "రెండేండ్లుకాలేదుగద, అప్పుడేయెలావచ్చేరు?" అన్నది అప్రయత్నంగా ప్రభావతి.

"రాజప్రతినిధి మహాత్మునితో రాజీజేసుకొన్నాడు. మొన్నటి లవణసత్యాగ్రహులతోబాటు మావంటి పాలరాజకీయఖైదీలనుగూడ కొందరిని విడిపించేడు. జయముమాదే".

"ఇదంతా నావ్రతప్రభావమే" అన్నది సగర్వంగా ప్రభావతి.